క్లుప్తంగా

టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, వైద్య, ఆరోగ్య శాఖాధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి టీబీ రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కలెక్టర్, జేసీ డాక్టర్ బి.నవ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో ఇంటెన్సిఫైడ్ టీబీ స్క్రీనింగ్‌లో భాగంగా హైరిస్కు ఉన్న ప్రజలను గుర్తించి నాట్ టెస్టు లేదా ఎక్స్‌రే చేయాలని సూచించారు. క్షయ వ్యాధి గుర్తించిన వారికి వెంటనే చికిత్సను ప్రారంభించాలన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు వైద్య ఆరోగ్యశాఖ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శాంతికళ, జిల్లా మలేరియా అధికారి నూకరాజు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాల్సిందేనని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం జొహరాపురంలోని ఆవాజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ముస్లింలపై వివక్ష చూపుతోందన్నారు. వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉద్ధృతం చేయనున్నట్లు చెప్పారు. మే 25న పాతబస్తీలో మానవహారం, 27న ఎస్టీబీసీ కళాశాలలో బహిరంగ సభ, జూన్ 3న నిర్వహించే సమావేశానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నూర్‌వలి,అబ్దుల్లా, మునవర్, ఇనయాత్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కల్లూరు: నగరంలోని వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 21వ వార్డు ఎన్జీఓ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ–2 లో రూ. 48.32 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే, కమిషనర్ రవీంద్రబాబు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కర్నూలు (సెంట్రల్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 6 – 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి పీవీ కిశోర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విద్యార్థులకు ఆకర్షణీయ బహుమతులను అందజేయనున్నట్లు ప్రకటించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ కన్సొలేషన్ బహుమతులను ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్‌ను తరిమేద్దాం అనే అంశంపై ఈనెల 28న మాధవ నగర్‌లోని రవీంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పోటీ పరీక్ష ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు 27వ తేదీ లోపు తమ పేర్లను 99128 07127 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ఉదయం 7:30 గంటలకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఎన్ఆర్ పేట శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. సంస్థ ఆధ్వర్యంలో నెల రోజులుగా సంగీత, నృత్య శిక్షణ శిబిరంలో నేర్చుకున్న వాటిని విద్యార్థులు సోమవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పత్తి ఓబులయ్య పాల్గొన్నారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ శేషయ్య, కళా నిల యం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'అత్యవసరమైతే'.. పరుగే!

రైతుబజారులో పొద్దుపు మహిళలే రోజూ 60 మంది వరకు ఉంటారు. దళారీలు, రైతులు కలిపి 350 మందికి పైమాటే. విని యోగదారులు రోజూ 2 వేల మందికిపైగా వచ్చిపోతుంటారు. ఆదివారాల్లో వీరి సంఖ్య 5 వేలు దాటుతుంది. ఇంతటి రద్దీ ప్రాంతంలో టాయ్‌లెట్ బ్లాక్‌లకు తాళాలు వేయడంతో మలమూత్రాలకు వెళ్లేందుకు దిక్కులు చూడాల్సి వస్తోంది.

- రైతుబజారు మరుగుదొడ్లకు తాళం
- సీఎం వచ్చి వెళ్లి పది రోజులైనా లభించని మోక్షం
- నిత్యం వందలాది మంది రాకపోకలు
- మహిళా రైతుల అవస్థలు వర్ణనాతీతం
- ఉపయోగంలోకి రాని కంపోస్టు మిషన్
- కూరగాయల వ్యర్థాలతో పరిసరాలు దుర్గంధం





పురుషులు, మహిళల టాయ్‌లెట్స్ బ్లాక్‌లకు తాళాలు వేసిన దృశ్యం



వృథాగా మారిన కంపోస్ట్ మిషన్



రైతుబజారులోని వ్యర్థాలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ప్రచార ఆర్భాటం తప్పితే ఎవరికీ ఎలాంటి ప్రయోజనం లేదనేందుకు కర్నూలు రైతు బజారు తాజా దుస్థితి నిదర్శనం. కర్నూలు సి.క్యాంపు రైతుబజారు రాష్ట్రంలోని టాప్ ఐదింటిలో ఒకటిగా గుర్తింపు పొందింది. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి తదితర మండలాలకు చెందిన రైతులకు ఇది అనుకూలం. ఈ నెల 17న ముఖ్యమంత్రి రైతుబజారులో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన రాక నేపథ్యంలో అప్పటికప్పుడు రైతు బజారుకు మెరుగులు దిద్దారు. ఆ కార్యక్రమం ముగియగానే.. రైతు బజారులోని టాయ్‌లెట్స్‌కు తాళాలు పడ్డాయి. సీఎం పర్యటన ముగిసి పది రోజులు గడిచినా ఇప్పటికీ తాళాలు తెరుచుకోకపోవడంతో మలమూత్రాల విసర్జనకు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. వందలాది మంది రాకపోకలు సాగించే రైతుబజారులో నెలకొన్న ఈ పరిస్థితికి ప్రతి ఒక్కరూ శాపనార్థాలు పెడుతున్నారు. మరీ ముఖ్యంగా మహిళల అవస్థలు వర్ణనాతీతం.

వినియోగంలోకి రాని కంపోస్ట్ మిషన్

రైతుబజారులో ప్రతి రోజు దాదాపు 2 టన్నుల మేర కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. వీటితో కంపోస్ట్ మిషన్ ద్వారా ఎరువు ఉత్పత్తి చేసి అమ్ముకునే విధంగా నగర పాలక సంస్థ కంపోస్ట్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనిని ముఖ్యమంత్రి ఈ నెల 17న ప్రారంభించారు. ఈ మిషన్ సామర్థ్యం 200 కిలోలు మాత్రమే. ఒక్కసారి వ్యర్థాలతో నింపితే 15–20 రోజులకు ఎరువు తయారవుతుంది. రైతుబజారులో రోజూ ఉత్పన్నమయ్యే వ్యర్థాలు 2 టన్నులు. కంపోస్ట్ మిషన్ వినియోగించాలంటే రంపపు పొట్టుతో పాటు కెమికల్స్ కూడా అవసరం. వీటిని నగరపాలక సంస్థ కానీ, ప్రభుత్వం కానీ సరఫరా చేయడం లేదు. దీంతో కంపోస్ట్ మిషన్ వృథాగా ఉండిపోయింది. ఫలితంగా వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేస్తుండటంతో రైతుబజారు దుర్గంధం వెదజల్లుతోంది.

ఎక్కడికి పోవాలో దిక్కుతోచదు

ఉదయం వస్తే సాయంత్రం ఒక్కోసారి రాత్రి 8–9 గంటల వరకు రైతుబజారులోనే ఉండాల్సి వస్తుంది. ఇక్కడి టాయ్‌లెట్ బ్లాక్‌లను మూసి వేసి తాళాలు వేయడంతో అత్యవసరమైతే ఎక్కడికి పోవాలో దిక్కుతోచడం లేదు. మేమంటే బయట ఎక్కడో ఒకచోట కానిచ్చేస్తాం. ఆడోళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు.

– నాగరాజు, రైతు, పడిదెంపాడు, కర్నూలు

తాత్కాలికంగా మూసివేశాం

రైతుబజారులో టాయ్‌లెట్స్ బ్లాక్ రీమోడల్‌కు రూ.7 లక్షలు మంజూరయ్యాయి. సీఎం వచ్చే ముందు మరమ్మతులు చేపట్టాం. క్యూరింగ్ కావాల్సి ఉండటంతో తాత్కాలికంగా మూసివేశాం. మరమ్మతు పనులు పూర్తయ్యాక అందుబాటులోకి తీసుకొస్తాం.

– కళ్యాణి, ఎస్టేటు ఆఫీసర్, సీ.క్యాంపు రైతుబజారు



ముసురు వాన



నగరంలో సోమవారం ఉదయం నుంచి ముసురుకొని కురుస్తున్న వర్షానికి ఈదురు గాలులు, చలి తోడవడంతో ప్రజలు వణికిపోయారు. పలుమార్లు తెరిపినిస్తూ వర్షం కురవడంతో ఫుట్ పాత్‌పై ఉన్న దుకాణాలన్నీ మూతపడ్డాయి. తప్పనిసరి పనులు ఉన్న వారు రెయిన్ కోట్‌లు, గొడుగులతో బయటకు వచ్చి తమ కార్యకలాపాలు సాగించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

విశాఖ ఉక్కు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం విశాఖ ఉక్కు పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 45 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం కానివ్వనని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఏమీ మాట్లాడడం లేదని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.నాగన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు భాస్కర్, సీఐటీయూ, ఏఐటీయూసీ నగర కార్యదర్శులు సాయిబాబా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే మరుగుదొడ్డి నిర్మాణం

కర్నూలు (టౌన్): నగరంలోని జొహరాపురం వద్ద ఓ వ్యక్తి రోడ్డుపైనే మరుగుదొడ్డి నిర్మిస్తున్నారు. చర్యలు తీసుకోవాలని అదే కాలనీకి చెందిన అయ్యస్వామి, శ్రీనివాసులు, ఈరన్న, ఖాదర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధ్యక్షతన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, విన్నపాలను అర్జీల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో 21 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. సమస్యలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- అశోక్‌నగర్‌లోని తమ కాలనీల్లో మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు రామలక్ష్మమ్మ, మద్దయ్య విన్నవించారు.



కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు వినతిపత్రాలు ఇస్తున్న నగరవాసులు

- శ్రీనివాస నగర్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాల్వలను పూర్తి చేయాలని స్థానికులు క్రిష్టయ్య, రమాదేవి, రమేష్ అభ్యర్థించారు.
- ధర్మపేటలో వీధి దీపాలు వెలగడం లేదని, వీధి కుక్కలు వెంటపడుతున్నాయని కాలనీ వాసులు దాసన్న ఫిర్యాదు చేశారు.
- 19వ వార్డు టీపీస్టు కాలనీలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు చేయాలని వెంకటరమణ కోరారు.
- ఎల్కూరు నగర్‌లో తమ ఇంటి వరకు సీసీ డ్రైన్ పొడిగించాలని శివప్రసాద్ రెడ్డి అభ్యర్థించారు.
- దేవనగర్, విఠల్ నగర్‌లో డ్రైనేజీ కాల్వలకు మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలని స్థానికులు మధు శేఖర్ నాయుడు, సాయిక్రిష్ణ కోరారు.

అధికారిపై చర్యలకు ఆదేశం

కర్నూలు (సెంట్రల్): 2010–13 మధ్య కర్నూలు జాయింట్ –1 సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న పి.ఉమామహేశ్వరిపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ సమయంలో ఆమె నాలుగు ఎకరాల పోరంబోకు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసింది. దీనిపై ప్రజాసంఘాలు లోకాయుక్తను ఆశ్రయించాయి. అప్పట్లోనే లోకాయుక్త ఆమెపై చర్యలకు ఆదేశించింది. ఇన్నాళ్లు పట్టించుకోని ప్రభుత్వం తాజాగా ఆమెపై చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం పి.ఉమామహేశ్వరి జిల్లా రిజిస్ట్రార్ హోదాలో సెలవులో ఉన్నారు.

పీఠాధిపతి జన్మదిన వేడుక

కర్నూలు కల్చరల్: దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఘనంగా జరిగాయి. గురు పూజ, స్వామీజీ దివ్య పాదుకులకు విశేషంగా పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సీపీ నగేష్, బి.ప్రకాష్, మాతృమండలి సభ్యులు సీపీ రాజేశ్వరి, అనంత లక్ష్మి, డాక్టర్ వై.నాగజ్యోతి, సుజాతమ్మ, జయభారతి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 156 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలకు సోమవారం 1776 మందికిగాను 1620 మంది విద్యార్థులు హాజరయ్యారు. 156 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరు విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు వెల్లడించారు.

పదోన్నతుల్లో నిబంధనలు పాటించాలి

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పారదర్శకంగా అమలు చేయాలని షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్ ఫెడరేషన్ (ఎస్టీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. జీఓ నంబర్ 5 ప్రకారం అన్ని క్యాడర్ల పదోన్నతుల్లో రిజర్వేషన్ వర్తింపజేసి ఎస్టీ ఉపాధ్యాయులకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పదోన్నతుల్లో ఎస్టీలకు అన్యాయం జరిగితే అధికారులు కోర్టుల చుట్టు తిరగాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధరణి, ఉపేంద్ర, కార్యదర్శి రామకృష్ణ, సురేష్, కర్నూలు జిల్లా గౌరవాధ్యక్షుడు గోవింద నాయక్, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైతులకు 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలను సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని మండిపడ్డారు. ఇంత వరకు విత్తనాలను సేకరించడంగానీ, గ్రేడింగ్ చేయడం గానీ చేపట్టకపోవడం అన్యాయమన్నారు. అన్నదాత సుఖీభవ అంటూ సీఎం చంద్రబాబునాయుడు రైతులను మోసం చేశారని, పాలన చేపట్టి ఏడాది దాటినా ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. నాయకులు బాబయ్య, రబీయా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ నడకతో రక్తపోటు అదుపు

కర్నూలు(హాస్పిటల్): రక్తపోటు ఆధునిక జీవనశైలిలో నిశ్శబ్ద ఆరోగ్య సమస్య అని, ప్రతిరోజూ నడక వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. రక్తపోటు అవగాహన మాసోత్సవం పురస్కరించుకుని సోమవారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో హౌస్‌సర్జన్లచే రోగులకు హెల్త్‌టాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్లు రక్తపోటుకు కారణం అవుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ నడకను అలవాటుగా మార్చుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చన్నారు. వివిధ పోస్టర్లు, బొమ్మల రూపంలో రోగులకు బీపీపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలకు అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం కోలుకున్న మహిళలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): పోర్టల్ హైపర్‌టెన్షన్ అనే అరుదైన సమస్యతో బాధపడుతున్న ఇద్దరు మహిళలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించి ప్రాణం పోశారు. వివరాలను జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ హరిచరణ్‌తో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సోమవారం తన చాంబర్‌లో తెలిపారు. వాంతుల్లో రక్తం వస్తుండటంతో పాములపాడుకు చెందిన ఎలీషారాణి(15) ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు పరీక్ష నిర్వహించగా అన్నవాహిక వేరిసెస్‌తో కూడిన పోర్టల్ హైపర్‌టెన్షన్‌గా నిర్ధారణ అయ్యింది. హిమోగ్లోబిన్ 6 గ్రాములు, ప్లేట్‌లెట్‌లు 60వేలుగా ఉండటంతో ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా ప్లేట్‌లెట్ కౌంట్ 5లక్షలకు పెరిగింది. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుంటుంది.

- గర్భాశయంలో రక్తస్రావంతో అనంతపురం జిల్లా బాలవెంకటాపురం గ్రామానికి చెందిన పర్వీన్ (29)ఆసుపత్రికి వచ్చారు. ఈమెకు కూడా పోర్టల్ హైపర్‌టెన్షన్ నిర్ధారణ అయ్యింది. ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా ప్రాథమికంగా 50 వేలు ఉన్న ప్లేట్‌లెట్లు 4 లక్షలకు పెరిగాయి. ప్రస్తుతం ఆమె కూడా పూర్తిగా కోలుకుంది.
- శస్త్రచికిత్సలను జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయక్, డాక్టర్ జయరామ్‌తో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్‌బాషా, డాక్టర్ ప్రణీత్, అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీప్రభాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రఘు ప్రవీణ, డాక్టర్ సంధ్య నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతం చేసిన వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు.

సారా వ్యాపారిపై కేసు నమోదు

కర్నూలు: కర్నూలు బంగారు పేటలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అదే కాలనీకి చెందిన నీలిషికారి మాధవి సారా విక్రయాలు జరుపుతుండగా తనిఖీ చేసి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మాధవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది సుదర్శన్ రాజు, మధు, రామలింగయ్య, ఈయన్న, చంద్రపాల్, లక్ష్మి, సువర్ణమ్మ పాల్గొన్నారు.

కడప బందోబస్తుకు తరలివెళ్లిన పోలీసులు

కర్నూలు: కడపలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర మహానాడు బందోబస్తు విధులకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 1200 మంది వివిధ హోదాల్లోని పోలీసులు తరలివెళ్లారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో పాటు అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 60 మంది సీఐలు, 90 మంది ఎస్ఐలు, 130 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 550 మంది కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ విభాగం నుంచి 53 మంది, మహిళా పోలీసులు 75 మంది, హోంగార్డులు 200 మంది, ఏఆర్ విభాగం నుంచి వివిధ హోదాల్లో ఉన్న సిబ్బంది 87 మంది, ఆరు స్పెషల్ పార్టీ బృందాలను మహానాడు బందోబస్తు విధులకు నియమించడంతో ప్రత్యేక వాహనాల్లో కడపకు వెళ్లారు.

నన్నూరు వాసికి డాక్టరేట్



జయనారాయణ రెడ్డి

కర్నూలు సిటీ: ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన డి.జయనారాయణ రెడ్డి జేఎన్‌టీయూ అనంతపురం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆయన వ్యవసాయ రంగాన్ని డేటా శక్తితో ఆధునీకరించేందుకు లోతైన పరిశోధన చేశారు. డీప్ లెర్నింగ్ ఆధారంగా పంటల దిగుబడి, అంచనా అనే అంశంపై ఆచార్య ఎం.రుద్రకుమార్ మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పొందిన జయనారాయణ రెడ్డికి జేఎన్‌టీయూ ఆచార్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆటోకు నిప్పు పెట్టిన దుండగులు

కర్నూలు: నగర శివారు కోడుమూరు రోడ్డులోని గురుబ్రహ్మ నగర్‌లో ఇంటి ముందు నిలిపిఉంచిన ఆటోకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. కాలనీలో నివాసముంటున్న మహబూబ్ బాషా ఆటోతోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన ఆటోను ఇంటి ముందు నిలిపి ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆటో తగలబడుతుండగా స్థానికులు కేకలు వేయడంతో ప్రజలు గుమికూడి నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆటో సగానికి పైగా కాలిపోయింది. ఘటనపై బాధితుడు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు పీఆర్ ఇంజినీర్ల బదిలీలకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీర్ల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతపురం పీఆర్ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయంలో జరుగుతుందని పీఆర్ ఎస్ఈ వీ.రామచంద్రా రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. జోన్ –4 పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన పీఆర్ ఇంజినీర్ల బదిలీలు అనంతపురంలో జరుగుతున్నాయన్నారు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిలో ముగ్గురు డీఈఈ, ఆరుగురు ఏఈలు ఉన్నారని చెప్పారు.

క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం

కర్నూలు (టౌన్): క్రీడాభివృద్ధికి, క్రీడల నిర్వహణకు ప్రోత్సాహంతో పాటు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని కోణిజేటి రోశయ్య హాల్‌లో ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ జిల్లా స్థాయి పోటీలను టీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో క్రీడ ప్రత్యర్థుల నుంచి కాపాడుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు లింగేశ్వరుడు, ఇన్‌చార్జ్ సతీష్‌కుమార్, వీరేష్‌బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

ఈహెచ్‌ఆర్‌తో పనిభారం

కర్నూలు (హాస్పిటల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు నమోదు వల్ల యూడీసీలపై పనిభారం పెరుగుతుందని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు చెప్పారు. ఈ మేరకు సోమవారం వారు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే పీహెచ్‌సీలలో ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర వ్యవహారాలకు సంబంధించి యూడీసీలపై పనిభారం ఎక్కువగా ఉందని, ఇప్పుడు మళ్లీ మధ్యాహ్నం వరకు ఈహెచ్ఆర్ నమోదు చేయాలని ఆదేశించడం వల్ల మరింత ఇబ్బంది అవుతుందని వారు పేర్కొన్నారు.

నేడు, రేపు యోగాంధ్ర కార్యక్రమాలు

కల్లూరు: మండలంలోని 15 గ్రామ సచివాలయాలలో మంగళ, బుధవారం యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎ.గోకులపాడు, బస్తిపాడు, బొల్లవరం, చిన్నటేకూరు, కె.మార్కాపురం, కొంగనపాడు, నాయకల్లు, బుధవారం పర్ల–1, పర్ల–2, పెద్దటేకూరు, పుసులూరు, సల్కాపురం, తడకనపల్లె, ఉలిందకొండ–1, ఉలిందకొండ–2 గ్రామ సచివాలయాల్లో యోగాపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని ఎంపీడీఓ పేర్కొన్నారు.